# ఋణాను బంధ రూపేణా

## -జొన్నలగడ్డ సదాశివ-

ఆకాశం మేఘావృతమై- మోహరించిన గజసైన్యం సంకుల సమరానికి ఆయత్తమైనట్టుంది.

ఉన్నట్టుండి యుద్ధభేరీ నినాదంలా ఓ భీషణ గర్జన. ఆ వెంటనే ఝళిపించిన విద్యుత్‌ఖడ్గ దగదగలు


వాతావరణం చలిచలిగా మారిపోయింది. అకస్మాత్తుగా సూర్యాస్తమయ వేళ కాక పోయినా మసక చీకట్లు కమ్మాయి. ఉండి ఉండి అక్కడోటి అక్కడోటి పెద్ద చినుకులు పడ్తున్నాయి. బందరు రోడ్డులో కాలవగట్టువైపు వెళ్ళే ఓ వీధిలో ఓ పాత పెంకుటింటి వరండాలో పడక్కుర్చీ వేసుక్కూచున్నాడు సుదర్శనం. ఓ అట్టలేని పాత వారపత్రిక పేజీలు ఊరికే తిరగేస్తున్నాడు. సుదర్శనానికి పత్రికలు చదివే ఆసక్తి అసల్లేదు. అయినా ఏమీ తోచనప్పుడు ఇంట్లోవున్న ఆ ఒకేఒక్క పత్రికని ఎప్పుడూ ఆ అరుగుమీదే వుండే ఆ పాత పడక్కుర్చీలో కూచుని పేజీలు తిరగేస్తుంటాడు దాదాపు అదొక అలవాటుగా.

క్రితం రాత్రి నైట్ డ్యూటీ చేసిన సుదర్శనానికి మధ్యాహ్నం నుంచీ వాతావరణం మబ్బుగా వుండటం మూలాన నిద్రపట్టలేదు. తలంతా భారంగా, దిమ్ముగా వుంది. ఇలాంటప్పుడు ఓ స్ట్రాంగ్ వేడి వేడి టీ పడితే బాగుండు ననుకున్నాడు. గుమ్మం ముందు ఇద్దరు కూతుళ్ళు, ఏడేళ్ళ పద్మ అయిదేళ్ల చిన్ని చేతులు తిప్పకుంటూ కేరింతాలు కొడుతూ గుండ్రంగా తిరుగుతున్నారు. రావటానికి సంశయిస్తున్న వర్షానికి స్వాగతం పలుకుతున్నట్టు వాన పెద్దదవుతోంది. ఇహ ఆటలు చాలించి లోపలికి పోండి సుదర్శనం కేకతో పిల్లలిద్దరూ బిక్క మొహాలతో వరండాలో కొచ్చి నిలబడ్డారు. అప్పడే లోపల్నించి వరండాలో కొస్తున్న నాయనమ్మ కాళ్ళని చుట్టేస్తూ ఆటకి అంతరాయం కలిగించిన తండ్రిని అర్థింపుగా చూస్తున్నారు.

“టీ పొడయి పోయిందన్నావు గదమ్మా?” అడిగాడు తల్లిని. “పక్కవాటా వదినగారిని అడిగి తీసుకున్నాలే రెండు చెంచాలు. స్టౌమీద నీళ్ళు మరుగుతున్నాయి. ఇస్తానుండు” అని కాంతమ్మ లోపలికెళ్లింది, పిల్లల్ని తీసుకుని.

ఉన్నట్టుండి ఆకాశంలో ఫెళఫెళా ఉరిమింది. వెంటనే పక్కనే బాంబు పడినట్టు ఓ భీకర శబ్దం, దగ్గరలోనే ఎక్కడో... పిడుగు పడింది.

సుదర్శనం వెన్నులో జలజల. తొట్రుపాటు.




మనస్సు నిండా ఏదో అలజడి, అశాంతి. ఆకాశంలో జరుగుతున్న ఘోర ప్రళయానికి గుండె కకావికలౌతున్న భావన. సుదర్శనం మనస్సులో ఊహాసుప్త భుజంగా లొక్కసారిగా జాగ్రతమై పడగలెత్తి బుసలు కొడుతూ చేస్తున్న మృత్యుహేల.

సుదర్శనం ఓ ప్రైవేటు లారీ ట్రాన్స్‌పోర్టు ఆఫీసులో లోడింగ్, అన్‌లోడింగ్ క్లర్కుగా పనిచేస్తున్నాడు. నైట్ డ్యూటీలో ఒక్కోసారి పని ఎక్కువ లేకపోతే- కుర్చీలోనే కాసేపు కునికిపాట్లు పడే వీలుంది.

కానీ...... క్రితం రాత్రి తొమ్మిదింటికి డ్యూటీ ఎక్కేసరికి తనకోసం రెండు లారీలు అన్‌లోడింగ్‌కి సిద్ధంగా వున్నాయి. హమాలీలతో సామాను గోడౌన్‌లోకి చేర్పించి ఇన్‌వార్డు రిజిస్టర్‌లో నోట్ చేసే సరికి పదకొండు దాటింది. ఓ హమాలికి టీ తెమ్మని చెప్పి తన కుర్చీలో కూచుంటూ ఓ నిట్టూర్పు విడిచాడు. ఒకసారి, ఆ తెల్లవారుజామున హైద్రాబాద్, విశాఖపట్నం వెళ్లే లారీల లోడింగ్ చెక్ చేసుకుంటే చాలు. ఓ రెండు మూడు గంటలు కునుకు తియ్యొచ్చు ననుకున్నాడు. టీకి పంపిన హమాలీ కోసం గుమ్మం వైపు చూసాడు. అంతే...

సుదర్శనం మొహం వివర్ణమైంది.

నెలల తరబడి సంస్కార మెరగని పండిన జుట్టు అస్తవ్యస్తంగా వుంది మొహం మీద పడ్తూ. బాగా మాసిన గెడ్డం మీసాలు. నల్లగా మాసి

మసిబారినట్టున్న లుంగీ, సగం చిల్లులు పడ్డ బనీను. బుజాన వెలిసిపోయిన ఎరుపురంగు కాశీ తువాలు. అస్తిపంజరం లాంటి శరీరంతో నడవలేక అడుగులో అడుగేస్తూ సుదర్శనం టేబులు దగ్గరకు చేరాడావ్యక్తి. ఆయాసంతో ఊగిపోతున్నాడు ఎంతో దూరం పరిగెత్తి వచ్చినట్టు.

సుబ్బారావును చూస్తూనే అవాక్కయ్యాడు సుదర్శనం.

గుండెనెవరో పిండిన అనుభూతి. మనస్సులో జ్ఞాపకాలు గుచ్చిన బాధతో బరువెక్కిన రెప్పల మాటు నుంచి నిస్సహాయపు చూపులు. క్షణం తర్వాత తేరుకుని...

"మళ్లీ ఇక్కడికెందుకొచ్చావ్? ఆఫీసుకి రావద్దని చెప్పలా?"


సుబ్బారావు. "ఈ టీ నేను తాగుతా..." పెదవుల మీద చిందర వందరగా వాలిన మీసాలను సర్దుకుంటూ టీ గ్లాసందుకున్నాడు.


"టీ తాగి వెళ్లిపో.." కర కుగా అన్న సుదర్శనం మాటకి తలెత్తి చూశాడు సుబ్బారావు నిరాశా నిస్పృహల నీడలు జీరాడే గాజు కళ్లతో. తలొంచి ఆత్రంగా నాలుగు గుక్కల్లో టీ తాగేశాడు. ఇప్పటికి కొంచెం తేరుకున్నట్టు నిట్టూర్చాడు.

"అయిపోయిందిరా సుదరూ.. ఇంకెన్నాళ్లు.. ఇహ ఆట్టే రోజులు గడవవు... నీ ఇంటి కొచ్చి... చివర్లోనయినా...చూపులో మళ్లీ ఆశతాలూకు ఓ చిరు వెలుగు

సుదర్శనం తండ్రి స్థితికి మనసులోనే ఆందోళన పడుతూ ఓసారి చుట్టూ పరికించాడు. తమ మాటలు పట్టించుకునే వాళ్లెవరూ దగ్గరలో లేరు.

"ఇహ ఆప్రసక్తి తేవద్దు. ఇంటి కొచ్చే సమస్యేలేదు. నువ్వు రావటం జరిగితే అమ్మ ఏమయి పోతుందో నేనూహించలేను." నెమ్మదిగానే అయినా, దృఢ నిశ్చయంలా అన్నాడు.





మొహంలో చిరాకుతో గొంతులో ఆవేదనతో అడిగాడు సుదర్శనం. సమాధానం చెప్పబోయిన సుబ్బారావుకి దగ్గుతెర అడ్డుపడింది.

రెండు నిమిషాలు గిలగిల్లాడిపోయి, తమాయించుకుంటూ. "కూర్చోనా?" అడిగింది సమాధానం కోసం కాదన్నట్టు టేబిల్ కెదురుగా వున్న చెక్క కుర్చీలో కూలబడ్డాడు.

హమాలీ ఓ గాజుగ్లాసుతో టీ తెచ్చి సుదర్శనం ముందు టేబిల్ మీద పెట్టి వెళ్లాడు. గ్లాసుని టేబిల్ మీద తన ముందుకు జరుపుకుంటూ, ఆయాసంతో ఒక్క క్షణం బరువుగా అన్నాడు

"అదికాదురా... బహుశా.. రెండు మూడు రో..జు..ల.. కంటే.." సుబ్బారావు కళ్లలో అతిదీనమయిన అర్థింపు.

"పాతికేళ్ల క్రితం మా మీద మమతాబంధాన్ని తెంచుకెళ్లిపోయిన్నాడు.. ఏమయింది? మేం చచ్చామో లేక ఎలా బతికామో ఆలోచించావా? ఇన్నేళ్ల తర్వాత... రెండు నెల్ల క్రితం... మా గురించి ఆరాలుతీసి అడ్రసు తెలుసుకుని, నేను బతికున్నానంటూ వచ్చావ్. నాలో ఏదో భయం ఇంటి అడ్రసు చెప్పనివ్వలేదు. అయినా... నువ్వు కనిపించావని, ఇంటికొస్తానన్నావని చెప్పినప్పుడు అమ్మ నిలువునా కుప్ప కూలిపోయింది. వణికి పోయింది. ఇన్నేళ్లూ నన్ను పెద్ద చెయ్యటానికీ, ఈ స్థితికి తేవటానికి తనను తను దీపంలా కాల్చుకుంటూ, గడిచిన బతుకు జ్ఞపకాలు ఆమెను ఊపి పారేశాయి. కుళ్లికుళ్లి ఏడ్చింది..."

కొడుకు మాటలకు సుబ్బారావు రెప్పవాల్చకుండా, స్థాణువులా చూస్తూండిపోయాడు.

తనమాటలు తండ్రి వింటున్నాడో లేదో తెలియటంలా. మళ్లీ చెప్పటం మొదలెట్టాడు.

"ఇహ ఈ జీవితానికేం మిగిలిందనీ, ఏమాశించి మళ్లీ వచ్చి చేరాలను కుంటున్నాడనీ, తన జీవితపు తుది మజిలీలో ఏమలుపూ, ఏ మార్పూ భరించలేననీ తెగేసినట్లు చెప్పింది ఆరోజే. తెగిన బంధాన్ని ముడెయ్యటానికి ప్రయత్నించొద్దని నాచేత పిల్లల మీద ఒట్టు వేయించుకుంది. తనకక్కర్లేదన్న బతుకుని అమ్మకి నేనివ్వలేను. నాకా అధికారం లేదు. నువ్వెళ్లు. మళ్లీ మళ్లీ కనిపించి నన్నేడిపించొద్దు. వెళ్లు.." చివరి మాటలంటున్నప్పుడు తండ్రి ముఖంలోకి చూడలేక తలొంచుకున్నాడు సుదర్శనం. ఆపుకుంటున్న దుఃఖం గొంతుకలో గడ్డకట్టినా, కళ్ల నుంచి ఉరికి పడే ప్రవాహాల్ని ఆపలేక పోయాడు. నుదురు పట్టుకుని అలాగే కూర్చుండి పోయాడు. చలనం లేకుండా సుదర్శనాన్నే చూస్తుండి పోయాడు సుబ్బారావు. టీ గ్లాసు కోసం వచ్చిన హమాలీ సాలోచనగా ఇద్దర్నీ చూస్తూ గ్లాసు తీసుకు వెళ్తూంటే సుబ్బారావు కుర్చీలోనే ఓసారి కదిలాడు. టేబిల్ పట్టుకుని లేచి నిలబడ్డాడు. కొడుకు మాట్లాడినంత సేపూ తనలో జరిగిన సంఘర్షణకి కదిలిపోయాడు. ఇప్పుడతని ముఖంలో తుఫాను తర్వాతి ప్రశాంతత. పెదిమల మీద విరాగిలాంటి చిరునవ్వు కదిలిపోయింది. ఆత్మీయత నిండిన కళ్లతో సుదర్శనాన్ని చూస్తూ..

ఏదో అమూల్యమైన దాన్ని శాశ్వతంగా వదిలివెళ్తున్నట్టు భారంగా వెనక్కి తిరిగాడు. గుమ్మం దాటి మెట్లు దిగబోతూ ఆగి వెనక్కి చూశాడు. సుదర్శనం అలాగే తలపట్టుకుని కూర్చున్నాడు.

అప్పుడే... తన చూపుల నుండి విముక్తి పొందిన ఆప్యాయతలా చెంపల మీదుగా ఆగని అశ్రుధారలు ఒకసారి ఎందుకో నిలువెల్లా కంపించాడు. వెను దిరిగి ఏదోసన్నగా గొణుక్కుంటూ మెట్లు దిగసాగాడు.

తలెత్తిచూసిన సుదర్శనానికి ఎదురుగా ఖాళీ కుర్చీ కనపడింది. గుమ్మం వైపు చూసి, కుర్చీ లోంచి లేచి దబదబా బైటికొచ్చాడు.

అప్పటికి సుబ్బారావు వీధిలో ఇరవై గజాల దూరంలో వున్న లైటు స్తంభం పట్టుకుని నిలబడున్నాడు: నడవటానికి శక్తి పుంజుకోటానికి. ఆ గుడ్డి వెల్తుర్లో వణుకుతున్న కాళ్లతో నిలబడ్డ సుబ్బారావుని చూస్తూనే పరుగులాంటి నడకతో దగ్గరకెళ్లాడు సుదర్శనం.

"నా...న్నా..." గజగజ వణుకుతూ సుదర్శనం నోట్లోంచి మొదటిసారి పలికిన రెండక్షరాలు.

సుబ్బారావు మనస్సుకి మాత్రమే వినిపించాయేమో! గబుక్కున తిరిగి చూశాడు.

కన్నీటి తెరలలోంచి తననే చూస్తున్న సుదర్శనం!

"సు..ద..రూ.." ఆనందంతో వణుకుతూ కొడుకు రెండు భుజాలు పట్టుకున్నాడు. సుదర్శనం ఫ్యాంటు జేబులోంచి వున్న ఒక్క పది రూపాయల నోటుతీసి "ఇది వుండనీ..." సుబ్బారావు చేతిని తనే తీసుకు చేతిలో పెట్టాడు.

" నా దగ్గిరివ్వడింతే వుంది. రేపు పొద్దున గవర్నమెంటు ఆస్పత్రికెళ్లి డాక్టరును చూపించుకో." అని వచ్చినంత వేగంగా ఆఫీసులో కెళ్లిపోయాడు.

వెళ్లిపోతున్న సుదర్శనాన్ని చూస్తూ నిలబడ్డ సుబ్బారావు కల కరిగిపోయినట్టు తనని తను చూసుకున్నాడు. చేతిలో మడతపెట్టిన పది రూపాయల కాగితం.

అది చూసి మనసులో ఎన్నడూ అనుభవించని దిగులు. **కుమిలిపోయాడు.** క్రమంగా మనస్సుని నిబ్బరించుకున్నట్టు పెదిమలు బిగించి, పిడికిళ్లు బిగించి కదిలి చీకట్లలో కలిసిపోయాడు.

* * *

వారుకాభ్రంలో మరో ప్రళయ గర్జన. ఆ గర్జనకి భీతిల్లినట్లు క్షణం ప్రకంపించి మాయమైన విద్యుల్లత. సుదర్శనం ఉలికిపడి, కళ్లు నులుము కున్నాడు.

టైమెంతైందో... అనుకున్నాడు.

వర్షంతో పాటు గాలి ఉధృతమై ప్రకృతిని ఊపేస్తోంది.

టీ గ్లాసుతో వచ్చిన కాంతమ్మ కొడుకు మొహం చూసి క్షణం నివ్వెరపోయింది.

"ఏమిట్రా ఆలోచిస్తున్నావ్?" గ్లాసందిస్తూ "వేడిగా వుంది చూసుకుతాగు" అంది మళ్ళీ. టీ తాగుతూ "అమ్మా... ఆయన మళ్లీ రాత్రి ఆఫీసుకొచ్చాడు" చెప్పాడు.

"ఎవర్రా?"

"ఆయనేనమ్మా... నాన్న.."

క్షణం ఆవేదన రూపు దిద్దుకున్న కళ్లలో చూపులు మరు నిమిషం తీవ్రంగా మారినాయి.

"ఎందుకు?... మళ్లీ ఏమంటాడు? మానిన గాయాల్ని రేపి ఏడిపించటానికి కాకపోతే. ఇంకో సారి రావద్దని చెప్పక పోయావా?" విసురుగ గానే అంది.

"చెప్పానమ్మా. అలాగే చెప్పా.. మనిషి చాల నీరసించిపోయాడు. దగ్గుకూడ ఎక్కువైంది. మాట్లాట్టానికే ఆయాసపడి పోతున్నాడు. వస్తానని దీనంగా ప్రాధేయపడ్డాడు. నాక్కూడ ఏడుపొచ్చేసింది... ఇవాట్టే రోజులుండడనిపించింది."

"పోనీ... ఆయన కర్మలో ఎలారాస్తే అల జరుగుతుంది." మాటలో ఉక్రోషం బుసకొట్టింది.

'సరేలే.. వాన ఎక్కువైంది. గొడుగు తీసుకుని సూపర్ బజార్ దాకా వెళ్లిరా. అది ఈ వానకి రాలేదేమో!

"అలాగే. టీ తాగటం పూర్తిచేసి లోపల్నించి గొడుగు తీసుకొచ్చి ప్యాంటు పిక్కపైకి మడుచుకుని బయలుదేరాడు. వర్షంలోనడుస్తున్న కొడుకుని చూస్తూ నిలబడిపోయింది కాంతమ్మ.

::::::::::::::::::

ఆదే సమయంలో...

ఆగండల్ సత్రం అరుగుమీద ముడుచుకు పడుకున్న ఓ ఆకారం కదిలింది.

నెమ్మదిగా లేచి క్షణం నిలబడి బయటి వర్షంలో రోడ్డుని చూసి బయలు దేరాడావ్యక్తి. కుండపోతగా పడుతున్న వర్షానికి కుంగిపోతున్నట్టు వంగిపోయి, గాలికి తూలి పడుతూ నెమ్మదిగా నిర్మానుష్యంగా వున్న ఆ రోడ్డు మీద ముందుకు కదులుతున్నాడు.

* * *

సుబ్బారావు ఓ ప్రైవేటు డాక్టరు దగ్గర కాంపౌండరుగా పని చేశేవాడు.

పెళ్లయిన కొత్తలో కాంతమ్మను బాగా చూసుకున్నా, క్రమంగా మనిషి మారి చెడు అలవాట్లకు దగ్గరయ్యాడు. అప్పుడప్పుడు తాగి వచ్చినప్పుడు గొడవ చెయ్యటం, కాంతమ్మను చెయ్యి చేసుకోవటం కూడా జరిగేది.

సామాన్య కుటుంబం నించి వచ్చిన కాంతమ్మ సహనంగా, ఎన్ని ఇబ్బందులు పడినా మూడో మనిషికి తెలియకుండా గుంభనగా, ఉన్నంతలో భర్త సౌఖ్యం కోసమే తాపత్రయపడేది.

ఓనాడు!


సుబ్బారావు రాత్రంతా ఇంటికే రాలేదు. ఏ పని మీద వెళ్లాడోనని మర్నాడు కూడా రోజంతా ఎదురు చూసింది. ఆ రోజు కూడ తిరిగి రాక పోవటంతో కాంతమ్మ భయపడింది. అతను పని చేసే డాక్టరుగారి డిస్పెన్సరీకి విషయం తెలుస్తుందని వెళ్లిన కాంతమ్మ అక్కడి దృశ్యం చూసి కొయ్యబారిపోయింది.

సుబ్బారావుతో పాటు నర్సుగా పని చేస్తున్న సుశీలను లేవదీసుకు పోయాడని సుశీల తల్లి గుండెలు బాదుకుంటూ శోకాలు పెడుతూంది. తన కొంప తీశాడని, సుశీలకు పెళ్లి కుదిరిందని, పెళ్లివారికేం చెప్పాలో తెలియటం లేదని ఏడుస్తూ సుబ్బారావుని శాపనార్థాలు పెడుతూంది. పోలీసు కంప్లైంటు చేస్తానంటున్న సుశీల తల్లికి డాక్టరుగారే ఏదో నచ్చచెప్పి పంపించాడు. కాంతమ్మకు కూడా సుబ్బారావు ఆచూకీ కనుక్కుంటానని డాక్టరే ధైర్యం చెప్పి పంపించాడు.

అంత వరకూ నిబ్బరంగా అపుకున్న దుఃఖం ఇంటికొచ్చిన కాంతమ్మకు కట్టలు తెంచుకుంది. అయిదారేళ్ల కొడుకుని గుండెలకి హత్తుకుని కుమిలిపోయింది.

రోజులు, నెలలు గడిచినా సుబ్బారావు ఆచూకీ తెలియలేదు. అనారోగ్యంతో, పెద్దతనంతో వున్న తండ్రికే సరైన ఆదరణ లేని అన్నగారింటికెళ్లటం కాంతమ్మ కెంతమాత్రం ఇష్టం లేక పోయింది. ఓ రోజు భర్త పనిచేసిన డాక్టరు గారింటి కెళ్లి






తన దీన స్థితి చెప్పుకుని ఏదైనా దోవచూపించమని అడిగింది.

డాక్టరు గిరిరావు భార్య కూడా డాక్టరే. వారికి ఒక కొడుకు, ఓ కూతురు. కొడుకు అమెరికాలో ఇంజనీరు. కూతురూ, అల్లుడూ కూడ డాక్టర్లే. వాళ్లూ అమెరికాలోనే సెటిలయ్యారు.

కాంతమ్మ మంచితనం తెలిసిన ఆ దంపతులు ఆమెను తమ ఇంట్లోనే వుండిపొమ్మన్నారు. వాళ్లకీ ఇంట్లో నమ్మకమైన మనిషి అవసరం. వంట ఇంటి బాధ్యతంతా తానే నిర్వహిస్తూ వారి అండతో సుదర్శనాన్ని స్కూల్లో చేర్పించింది కాంతమ్మ. సుదర్శనం ఎస్సెల్సీ వరకూ వచ్చాడు. తల్లి తండ్రుల్లా చూసుకుంటున్న డాక్టరు దంపతుల ఆదరణలో కాంతమ్మ కింత కాలం ఏ సమస్యా లేకుండానే జరిగింది. కానీ–ఇప్పుడు...

గిరిరావు దంపతులు అమెరికా వెళ్లిపోవటానికి నిశ్చయించుకోటంతో కాంతమ్మకు మళ్లీ భవిష్యత్తు భయం కొల్పింది. అయితే– ఎస్సెల్సీ పాసయిన సుదర్శనం ఓ లారీ కంపెనీలో ఉద్యోగం సంపాదించుకోటంతో ఆ గండం గట్టెక్కినట్టయింది కాంతమ్మకు. ఆ తర్వాత మూడేళ్లకి దూరపు బంధుత్వంలోనే లక్ష్మితో పెళ్లి జరిగింది సుదర్శనానికి.

ఇద్దరు పిల్లలు పుట్టి సంసారం పెరగటంతో సుదర్శనానికి వచ్చే జీతం చాలక ఇబ్బందులుగానే వుంది. అందుకే– లక్ష్మి భర్తనీ, అత్తగారిని ఒప్పించి కొత్తగాపెట్టిన మహిళా సూపర్‌బజార్‌లో సేల్సు ఉమన్‌గా చేరింది. ఈ మధ్యనే. ఇద్దరి సంపాదనా కూడ గలిపి, సంసారాన్ని గుట్టుగా నడుపుతున్నది కాంతమ్మే. తల్లి ఆలనపాలన మాత్రమే ఎరిగిన సుదర్శనం చాల విషయాల్లో ఇంకా తల్లిచాటు బిడ్డలాంటి వాడే.

* * *

అకస్మాత్తుగా రెండు నెల్లక్రితం బికారిలా తన ఆఫీసుకొచ్చిన సుబ్బారావుని మొదట గుర్తించనే లేదు సుదర్శనం. సుబ్బారావు తనే చెప్పుకున్నాడు. అనాడు భార్యనీ కొడుకునీ అన్యాయంగా అనాథల్ని చేసి వెళ్లిపోయాననీ, ఆ పాపం తనని కట్టి కుదిపిందీ, కొన్నేళ్లు ఒళ్లూపై తెలియకుండా గడిపేసినా తర్వాత తన జీవితం తెగిన గాలిపటమైందనీ, ఎక్కడెక్కడో తిరుగుతూ ఎలాగో కాలం గడిపాననీ, చివరికి ఆకలికి తట్టుకోలేక ప్రాణాలు నిలుపుకోటానికి శవవాహకుడిగా పతనమై పోయాననీ వాపోయాడు. "ఒళ్ళంతా గుల్లయి పోయింది. ఏ పనికీ శక్తిచాలటం లేదు. దానికితోడు దగ్గూ ఆయాసం. ఈ అవసాన దశలో ఒంటరితనం వేధిస్తూంది. నువ్వూ మీ అమ్మ నన్ను క్షమిస్తానంటే చివరి నాల్రోజులూ మీతో వుండి కళ్లు మూయ్యాలనుంది.' ' ఒక్కొక్కమాట అడగలేక అడుగుతున్నట్టుంది. కొడుకు మొహంలోకి ఆశగా చూశాడు సుబ్బారావు.

ఏనాడో గుండెరాయి చేసుకున్న కాంతమ్మ ససేమిరా వీల్లేదంది. తల్లి పట్టుదల తెలిసిన సుదర్శనం ఏమీ చెప్పలేక పోయాడు.

"ఈ విషయంలో అమ్మ మనసుని బాధ పెట్టలేను" అని తలొంచుకున్నాడు సుదర్శనం.

ఆ రోజు నుంచి సుబ్బారావు కొన్నాళ్ళు మళ్లీ కనిపించలేదు. ఓ రోజు ఆఫీసు పనిమీద ఒన్ టౌన్‌కి వెళ్లి వస్తూంటే– అరండల్ సత్రం అరుగుమీద కూర్చునున్నాడు సుబ్బారావు. ఇద్దరి చూపులూ ఒకేసారి కలిశాయి. వెంటనే తలతిప్పుకుని చకచకా నడిచాడు. సుబ్బారావు కాళ్లు ముడుచుకు కూర్చున్న తీరుకి సుదర్శనం మనస్సు విలవిల్లాడింది. తిండి తిని ఎన్నాళ్లయిందో అనిపించింది. ' ఏమయినా తన జన్మకి కారకుడు... అమ్మ కెందుకంత పట్టుదల? అమ్మకి మరోసారి నచ్చచెప్తే..." అనుకున్నాడు కూడా.

వర్షంలో గొడుగు పట్టుకు నడుస్తున్న సుదర్శనాన్ని చూస్తూనే కంపెనీ హమాలీ సైకిల్ మీంచి ఒక్కుదుటునరోడ్డుమీద పారుతున్న నీళ్లలోకి దూకేశాడు. సుదర్శనం ఏదో అడగబోతుండగానే.

'రాత్రి మీ దగ్గర కొచ్చి కూచున్నాడే... ముసలాయన..." హమాలీ కళ్లమీంచి కారుతున్న నీటిని తుడుచుకున్నాడోసారి. "ఎట్లా వచ్చాడో పాపం ఈ వర్షానికి.. మన ఆఫీసు మెట్లెక్కుతూ పడిపోయాడు. స్పృహలో లేనట్టుంది బాబూ..."

ఏమీ తోచని అయోమయ స్థితిలో చూస్తూ విలబడిపోయాడు సుదర్శనం.

"మీరు ముందు పదండీ బాబూ..." సైకిలందిచ్చాడు హమాలీ.

ఆఫీసుకి చేరుతూనే సైకిలు నేలకొదిలేసి గబగబా మెట్లెక్కాడు సుదర్శనం. వరండాలో పడివున్న సుబ్బారావుని చూడగానే– వెన్నులో ఏదో పాకినట్టయింది. చుట్టూ చూసేడు. తన ఆఫీసు స్టాఫ్‌తో పాటు, వర్షం వల్ల ఆగిన జనం నలుగు రైదుగురు సుబ్బారావు అక్కడి దాకా ఎలా వచ్చి పడిపోయిందీ మాట్లాడుకుంటున్నారు. సుదర్శనానికి ఒక్క మాటా అర్థం కాలేదు.

అప్పుడే ఏదో తట్టింది.

వంగి మోకాళ్ల మీద కూర్చుని సుబ్బారావు చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. మంచుగడ్డ తాకినట్టుంది. శ్వాస చూడబోయాడు సుదర్శనం..

"లేదు సుదర్శనం...' ఇందాకే ప్రాణం పోయింది. వస్తూ కిందమెట్టుమీద పడిపోతే– వర్షానికి కాలు జారిందనుకున్నాం. ఎంతకీ లేవకపోతే– మేమే వెళ్లి చూసి వరండాలోకి చేర్చాం. అప్పటికే ప్రాణం పోయింది. ఈయనెవరో నీకు తెలుసంటే హమాలీని పంపించాను..." డే డ్యూటీ' లోడింగ్ క్లర్క్ చెప్తున్నాడు.

శవం పక్కన చతికల పడిపోయాడు సుదర్శనం. ఇంకా తన చేతిలోనే వున్న సుబ్బారావు పిడికిట్లోంచి తడిసి నీళ్లు కారుతూన్న ఓ పది రూపాయల నోటు వెక్కిరిస్తున్నట్టుంది.

ఎందుకో.... సుదర్శనం కళ్లు పొంగి పొర్లాయి. కట్టలు తెంచుకున్న అశ్రుధారలు తల్లోంచి కారుతున్న వర్షపు ధారల్లో కలిసి జారిపోయాయి.